# అయినా పశ్చాత్తాపం లేదు

**- రామకృష్ణారెడ్డి**

**తన జీవితం మీదా, మొత్తం కుటుంబం మీదా విపరీతమైన ప్రభావం మోపిన యీ అయిదారు రోజుల అనుభవాన్నీ జ్ఞాపకం చేసుకుందామనుకున్నా సాధ్యం కావడం లేదు అరుణకు.**

ఆ సంఘటన జరిగి అయిదారు రోజులేనా? తన మెదడుకు ఆలోచించడం తెలిసి శైశవంలో జరిగిందా? లేకపోతే, దీనికంతా ఒక రకంగా తను కేంద్రంగా వుండీ, తన ప్రమేయమేమీ లేకుండా, తన ఆలోచనల్తో అవసరం లేకుండా, అసలు తను ఆలోచించవలసిన అవసరం వుందని తనకే తెలీకుండా.. ఎలా వుండిపోయినట్టు?

ఇది తన మూలంగా జరిగింది కాదు, తన భాగ స్వామ్యం వున్నదీ కాదు. కనీసం తన పొరపాట్లవల్ల, తప్పుల వల్ల జరిగింది కూడా కాదు. ఎవడో బయటివాడి వల్ల, తన జీవితంతో ఏ సంబంధమూ లేని వాడి వల్ల ఏర్పడిన పరిస్థితి ఇది. తన తప్పుల పర్యవసానంగా జరిగిందయితే, దీన్నెదుర్కోవడానికి ఎంతో కొంత సంసిద్ధంగా వుండేది. ఇదలాంటిది కాదు. కనుకనే తన ప్రమేయం లేని, తన చైతన్యాన్ని చొరనివ్వని . . . 'షాకింగ్'లో వుండిపోయింది. నిజానికీ అనుభవం, తన రక్తనాళంలో రక్తం గడ్డకట్టి ఆగిపోయినట్టు తన జీవితం నుంచీ ప్రత్యేకమైన 'నిడి' భాగంలా శాశ్వతంగా వుండ బోతుంది. తన కెటువంటి సంబంధమూ లేని యీ అనుభవం తన జీవితాన్నింతగా కుదిపేయడం.. ఎంత దారుణం? ఎంత అన్యాయం!

అరుణ ఇక పడుకోలేక లేచి మంచం మీద కూర్చుంది. ఎదురుగ్గా 'టీపాయ్' మీద అమ్మ పెట్టి వెళ్ళిన ఉప్మా ప్లేటూ, సాసర్ మూసి వుంచిన కాఫీ కప్పూ కనిపించాయి. మంచం మీది నుంచి దిగి కాఫీ కప్పు అందుకుని, కిటికీ కెదురుగ్గా వున్న కుర్చీలో కూర్చుంది. కిటికీగుండా ప్రపంచం కదలిపోతోంది. వీధిలో బిగ్గరగా రాజకీయాల్ని గురించి వాదించుకుంటూ పోతున్న ముగ్గురు మగవాళ్ళు... అరుణా వాళ్ళింటి దగ్గరికొస్తూనే హఠాత్తుగా మాటలాపి, ఇంటికేసీ, ఇంట్లో వున్న అరుణ కేసీ చూసి, ఆ తర్వాత ఒకరి ముఖాలొకరు చూసు కుని... ఆ ఇల్లు దాటుతూనే మాటలందుకున్నారు. వీధి చివరి సామ్రాజ్యం అంటే చిన్న కూతురు పద్మతో కలసి ఎక్కడికో వెళుతోంది. అక్కడి కొస్తూనే, పద్మ భుజం మీద చేయి బిగించి (అరుణలా కాకుండా కాపాడుకోవాలనా?) తమ ఇంటి కేసి అసలు చూడ కుండా (కావాలనే) దాటుకుని పోయింది.

ఇదంతా తన భ్రమా? తన మానసిక వికారమేనా? కాదు. వీధిలో వెళుతున్న వాళ్ళు తమ ఇంటికేసి చూడ్డమెంత సహజమో, చూడకపోవడమూ అంతే సహజం. అయితే, ఇందులో వాళ్ళ 'ప్రయత్నం' తన కళ్ళకు స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ముగ్గురు మగవాళ్ళూ తమ ఇంటికేసి చూడ్డంలోనూ, ఆ 'ఆసక్తి'లోనూ, యీ 'అసహ్యం'లోనూ ఒకే అర్థం! సామ్రాజ్యం అంటేది నిశికిడి జ్ఞానమైతే, యీ వీధి వాళ్ళు కాని ఎవరో తనకు తెలిసి ఆ మగవాళ్ళది ప్రతికాజ్ఞానం. "అదిగో ఆ అమ్మాయే! ఓ... ఆ అమ్మాయా? ఏసీ ఆ అమ్మాయా?" పాపం! పాపం! ఇంకెవరు పెళ్ళి చేసు కుంటారు, ఇంత గొడవయిం తర్వాత?



నిజానికీ మాట ఉదయం అమ్మా నాన్నే అన్నారు. శ్రేయోభిలాషులిస్తున్న సలహా కింద చెప్పినా వాళ్ళకూ అటువంటి అభిప్రాయముందన్నది తెలుస్తోనే వుంది. కేసు ఉపసంహరించుకుంటే 'అరుణ'ని పెళ్ళి చేసుకోవ డానికి వాళ్ళు ఒప్పుకుంటారట. అలా చేయడమే మంచిదని లాయరూ, పోలీసు అధికారులూ, ఇతర పెద్దలూ సలహాలిస్తున్నారట. 'మీరూ మీరూ ఇష్టపడితే మా ఆందోళనని విరమిస్తాం' అని స్వచ్ఛంద సంఘాల వారూ అన్నారట. కాదు... కూడదని కేసు కొనసాగిస్తే, కేసు నెగ్గే అవకాశం లేకపోవడం అలా వుంచి నెగ్గినా మనకు వచ్చేదేముంది? వాడికి ('అతనికి' అన్నారు) శిక్షపడితే మాత్రం పోయిన మన పరువొస్తుందా? — నిన్ను పెళ్ళి చేసుకోవడానికెవరైనా ముందుకొస్తారా (ఇంత గొడవయింతర్వాత)? — కోర్టులో వాళ్ళ లాయర్ వేసే ప్రశ్నలు ఎంత అవమానకరంగా వుంటాయో, కుటుంబమంతా ఎలా తలవంచుకోవలసి వస్తుందో నీకు తెలుసా? — 'ఇలాంటిది' జరిగినవాళ్ళం దరికీ ఇటువంటి అవకాశం వస్తోందా? — అసలు ఇంత 'గొడవ (మళ్ళీ) జరక్కపోతే, వాళ్ళలాంటి సంబంధం మనకు అందుబాటులో వుండేదా?—

ఆ మాటలు అంటున్నప్పుడు, ఆ సలహా చెబుతున్న ప్పుడు అమ్మా నాన్న ముఖాల్లోకి ఒకటి రెండు సార్లు చూసింది తను. 'ఇంత గొడవ' అన్న మాటలో 'ఈ గొడవ తెలిసి తక్కువగా నువు చేసిందే' అన్న ఆరోపణ అంతో ఇంతో వుందనిపించింది. ఇంత గొడవా తన వల్ల రాలేదనీ, వాడి వల్ల వచ్చిందనీ అమ్మా నాన్నే భావించక పోవడం ఎంత విచిత్రంగా విషాదకరంగా వుందో!

# స్వప్నకుమారి పెళ్ళి

నీ
కల
జీవితం నీకు కన్న మానసపుత్రిక
మెత్తటి గులాబి రెక్కలాంటి పసిపాపలాగ
నీ ఆలోచనల్ని కావలించుకొని
నీ వాత్సల్యాన్ని పొంది'
నిన్ను పొంది
ఇలాగ ఇలాగ పెద్దవుతుంది
కల నీ బంగారు తల్లి
కల నీ గారాబు పట్టి
కలకు వయసు వచ్చాక
లోకపు చూపు సోకకముందే
చీకటి వాల చెరపట్టకముందే
కల కోసం తపించి
కల కోసం చలించి
కల కోసం ఒక మనోకవనాన్ని సృష్టించి
కలతో కలనై కలతై జ్వలించి
కలగన్న తండ్రీ—
కలకు వాస్తవాన్నిచ్చి పెళ్ళి చెయ్యవా?

—కనకప్రసాద్

ఒకవేళ తను గొడవే చేసివుంటే, ఆ గొడవ చేయకుండా వుండడం సాధ్యమయ్యేదా?

అరుణ ఆలోచనలు ఆ 'గొడవ'లోకి వెళ్ళిపోయాయి. శారద బి.ఎ.లో తన క్లాస్‌మేట్. తను ఎం.ఎ. కోసం యూనివర్సిటీకి వెళ్ళక ముందు ఇద్దరూ తరుచుగా కలుసుకునే వాళ్ళు. వాళ్ళ ఇంటికి వెళ్ళడం తన కలవాటే. యూనివర్సిటీకి సెలవులు రావడంతో ఆ రోజు శారద దగ్గరికి వెళ్ళాలనిపించింది. దూరదూరంగా పెద్ద పెద్ద పోర్టికోలతో బంగళాలుండే ఆ ఏరియాలో శారదా వాళ్ళ ఇల్లు ఆరో లైన్లో ఆఖర్న వుంది. అప్పటికి సాయంత్రం ఆరయింది. గంటో గంటన్నరో కూచుని వచ్చేద్దామనుకుంది.

'కాలింగ్ బెల్' నొక్కుతూనే శారదావాళ్ళ అన్న మోహన్రావు వచ్చాడు. "ఓ.. అరుణా! కమిన్.. కమిన్" అన్నాడు. బి.ఎ.లో తనకు లెక్చరర్ కూడా అతను. మొదటి గదిలోకి వెళుతూనే, అంతవరకూ అతను చేస్తూండిన పనేమిటో అర్థమయింది. గ్లాసులూ, విస్కీ సీసా సర్దుతూ వచ్చాడు. తనూ నవ్వి "శారద లేదా?" అనడిగింది. కొంచెం తడబడుతూ (అప్పుడు తాగడం వల్ల అలా వున్నాడనుకుంది) "ఆ.. ఆ... పైన వుంది" అన్నాడు. తను మెట్లెక్కి మేడ పైకి వెళ్ళింది. ఎవరూ లేరు. కోపమూ, అసహ్యమూ అంతకంటే ఎక్కువగా భయమూ కలిగింది. మెట్లు దిగి వస్తున్నప్పుడు, ఎర్రని కళ్ళతో మధ్యలో ఎదురయ్యాడు.

తలుపు తీసి, తనను బయటికి తోసేసి "వెళ్ళిపో... వెళ్ళిపో" అని మళ్ళీ తలుపేసుకున్నాడు. ఎంత తేలిగ్గా ఎంత దారుణం జరిగిపోయిందో తల్చుకునే కొద్దీ తను తట్టుకోలేకపోయింది. అయిదు నిమిషాలకు ముందున్న అరుణ కావడం తన కెన్నటికీ ఇక సాధ్యం కాకపోవచ్చు. వాడికి... అయిదు నిమిషాల తర్వాత ఏ మార్పూ వుండదు. బిగ్గరగా తిట్టాలనుకుంటే.. వాడికి తగిన ఒక్క తిట్టూ వున్నట్టు లేదు. వాడు తన 'శీలాన్ని' తన 'సర్వస్వాన్ని' అపహరించినట్టు అనిపించలేదుగానీ, తన వ్యక్తిత్వాన్ని పరమనీచంగా, అమానుషంగా అవమానించినట్టనిపించింది.

ఇంత ఘోరంగా, ఇంత హీనంగా తననూ, తన వ్యక్తిత్వాన్నీ అవమానించడానికి వాడికేం అధికారం వుంది? ఏడ్వకూడదనుకుంటూనే ఏడ్చేసింది. ఏడుస్తున్నందుకు మరింత అవమానమనిపించి, తన నిస్సహాయతనూ తనకు జరిగిన అన్యాయాన్నీ తలుచుకుని నోటికొచ్చిన తిట్లేవో తిట్టింది, హిస్టీరికల్‌గా కేకలు వేసింది! పదిమందీ చేరారు. ఎలా చెప్పిందో తెలీదు. "తలుపులు బద్దలు కొడతాం, తలుపులు తియ్యి" అని హెచ్చరించారు. తప్పదనుకుని వాడు తలుపులు తీశాడు. పట్టుకుని తన్నారు. ఇంతలో పోలీసులొచ్చారు. వాడిని స్టేషన్‌కు తీసుకెళ్ళడం, తనను మెడికల్ టెస్టుకు పంపించడం, అమ్మా నాన్న యీ విషయం తెలుసుకుని క్రుంగిపోయి రావడం, పత్రికల్లో 'అవివాహిత యువతిపై అత్యాచారం' అంటూ రావడం... ఇవన్నీ అర్ధచేతనావస్థలోని అనుభవాల్లా దృశ్యాల్లా జ్ఞాపకమున్నాయి.

పత్రికల్లో రోజూ ఎక్కడో చోట 'స్త్రీపై అత్యాచారం' వుంటుంది. అగ్రవర్ణాల వారు దళితులపై దాడి చేసి వాళ్ళ స్త్రీలపై అత్యాచారం జరుపుతారు. పోలీసులు 'లాకప్'లోనో, గ్రామాలపైనో, గిరిజన తండాలపైనో దాడి చేసి మహిళలపై అత్యాచారం చేస్తారు. ఎక్కడో అరవయ్యేళ్ళవాడు ఆరేళ్ళ పాపపై...! ఇంకెక్కడో ఇరవయ్యేళ్ళవాడు అరవయ్యేళ్ళ ఆమెపై...! ఇలా రకరకాల అత్యాచారాలు. నిజానికివి రకరకాల అత్యాచారాలుగా కనిపిస్తున్నా ఒకే రకం అత్యాచారమే. 'మగ'జాతి 'ఆడ'జాతిపై జరుపుతున్న అత్యాచారం. అత్యాచారం చేసేందుకు హక్కు వుందనుకోవడం వల్ల జరుగుతున్న 'అత్యాచారం.'

ఇలాంటి 'అత్యాచార' వార్తల్ని పత్రికల్లో చదివినప్పుడల్లా బాధపడేది, విచారపడేది. అయితే, తన బాధ విచారం ఆ సంఘటనకు పరిమితమై వుండేవే కానీ, దాని సర్వసహావాన్ని ప్రభావాన్ని గ్రహించగలిగిన స్థాయిలో వుండేవి కావు. ఆలోచించగల మెదడూ, స్పందించగల హృదయమూ శరీరమూ వున్న మనిషినైన, తను తిరస్కరిస్తూ తీవ్రంగా విరోధిస్తున్నా దుర్మార్గంగా అవమానించడం వల్ల పరిణామం ఎంత భయంకరంగా వుంటుందో తన కిప్పుడు అర్థమయింది.

నిజానికి ఎవడో ఒక మగవాడు ఏదో అవకాశం దొరికినప్పుడు స్త్రీపై జరిపిన అత్యాచారంలోనే దాని స్వరూప స్వభావాలు లేవు. దానికి వెలుపల సమాజంలో దాన్ని గురించి వున్న భావజాలంలోనే గొప్ప 'అత్యాచారం' వుంది. అత్యాచారం జరిపిన మగవాడికి యెటువంటి నష్టమూ వుండదనీ, అత్యాచారానికి గురైన ఆడదానికే అంతా నష్టమనీ నమ్మడంలోనే, ఆ నమ్మకం కొనసాగేట్టు చూడ్డంలోనే అసలైన అత్యాచారం వుంది. ఈ నమ్మకం పైకి, స్త్రీకి జరిగే నష్టాలను కేవలం వాస్తవిక దృక్పథంతో గుర్తిస్తున్నట్టుగా కనిపిస్తూనే, అంతకన్నా వెయ్యి రెట్లు ఆమెకు నష్టం జరిగేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఈ నమ్మకం, తనను 'రేప్' చేసినవాడిని 'ఇకపై జీవితాంతం రేప్ చేయ'మని కోరే హీనస్థితికి స్త్రీని దిగజారుస్తున్నది.

ఈ సంగతి ఇంతకు ముందైతే ఇంత స్పష్టంగా తనకు అర్థమయ్యేది కాదేమో! ఇలాంటి సందర్భాల్లో "నిజమే గదా, సమాజం అలా వుంది మరి, స్త్రీకి అంతకన్నా గత్యంతరమేముంది?" అనుకునేదేమో! ఉదయం అమ్మా నాన్న చెప్పినట్టే, ఇంకెవరి అమ్మా నాన్నలైనా చెప్పినట్టు తెలిస్తే, "అవును మరి, పాపం కన్నబిడ్డ కోసం పడుతున్న తాపత్రయం" అనే అనుకునేది. అమ్మా నాన్నలను అమ్మా నాన్నలుగానే తప్ప సామాజిక భావజాలపు కుట్ర చట్రంలో వున్నవాళ్ళుగా గుర్తించలేకపోయేది. తనవైపున వాదించి నేరస్తుడికి శిక్షపడేట్టు చూడవలసిన న్యాయవాదీ, సామాజిక శ్రేయస్సు కోసం పోరాడవలసిన సంఘాలవాళ్ళూ, ఎవరూ నిజానికి తన వైపున లేరని గుర్తించలేకపోయేది. పైపెచ్చు వాళ్ళంతా తన మేలు కోరి చెబుతున్నట్టుగా పొరపాటుపడేది. ఇతర అన్ని నేరాల విషయంలో వున్నట్టు కాకుండా, కేవలం యీ ఒక్క నేరం విషయంలోనే ఎంత విచిత్రమైన ఎంత అసహజమైన పరిస్థితి వుందో ఆలోచిస్తే, ఇది సమాజ సహజ స్వరూపం కాదని అర్థమవుతుంది. ఎవడైనా చిన్న దొంగతనం చేస్తే, ఆ దొంగిలించిన వస్తువును వాడికివ్వడం లేదు. అలాంటప్పుడు ఇంత పెద్ద నేరస్తుడికి, ఒక మనిషిని అప్పగిద్దామనడాన్ని ఏమనాలి?

తను ఇంత బాగా ఆలోచించ గలగడం తనకే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎలా సాధ్యమయింది? ఈ అయిదారు రోజుల్లో ఆలోచనా రహితంగా మొద్దులాగా వున్న తనే ఇంత సక్రమంగా ఎలా ఆలోచించగలిగినట్టు? మొదటి 'షాక్'కు రెండో 'షాక్' విరుగుడుగా పని చేసిందా? అరుణ మొహంలో నవ్వు,ఆకును కదిలించిన చిరుగాలిలా పాకింది. తనకు జరిగిన అవమానం ఎంత తీవ్రమైనదో తనకు బాగా తెలిసినందువల్లనే, యీ సంగతి తెలుసుకోగలిగింది తను. 'అవమానం' అంటే ఏమిటో తనకు తెలిసింది కనుక, దాన్ని ప్రశ్నించడం దాన్ని ప్రతిఘటించడం అవమానమనుకోదు. అవమానానికి లొంగడం అసలు అవమానం. కేసు గెలవలేకపోవచ్చు, వాడికి శిక్ష వేయించలేకపోవచ్చు. కోర్టులో లాయర్ ప్రశ్నలు బాధించవచ్చు.. ఆ అవమానాలు తనవి కావు, సమాజానివి. అమ్మా నాన్న చెప్పిందాని కొప్పుకుంటే ఆ అవమానం తనదే కాదు, స్త్రీలందరిదీ.

'అవమానం' అంటే ఏమిటో తెలిసిన అరుణకు ఇప్పుడు 'ఆత్మగౌరవం' అంటే ఏమిటో కూడా తెలిసినట్టయింది. బతుకు మీద మళ్ళీ ఆసక్తి ఏర్పడినట్టు 'టీపాయ్' మీది ఉప్మా ప్లేటు అందుకుంది. ఉప్మా బాగా చల్లబడిపోయింది. 'అయినా ఫర్వాలేదు'.